## నాగోబా ఆలయంలో గుస్సాడీల పూజలు


నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న లక్కుగూడ ఆదివాసులు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 29 : ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవమైన నాగోబా ఆలయంలో మండలంలోని పిప్రి గ్రామ పంచాయతీ పరిధిలో గల లక్కుగూడ గ్రామానికి చెందిన గుస్సాడీలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం నాగోబా ఆలయ ఆవరణలో గుస్సాడీలు నృత్యాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ లక్కుమారు, సుంగు పటేల్, సంబు పటేల్, దేవరి గంగారాం, మహాజన్ ఆత్రం లాల్‌దేవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సరస్వతీ అమ్మవారికి రూ.11 లక్షల విరాళం


అమ్మవారికి విరాళం అందజేసిన భక్తుడు

బాసర, అక్టోబర్ 29 : బాసర సరస్వతీ అమ్మవారికి మంగళవారం ఓ భక్తుడు రూ. 11 లక్షల విరాళం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లికి చెందిన విజయ సరస్వతి దాసు మంగళవారం అమ్మవారిని దర్శించుకుని రూ.11 లక్షలను విరాళంగా ఇచ్చాడు. సంబంధిత చెక్కును ఆలయ ఈవో విజయ రామారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భక్తుడిని సత్కరించి, అమ్మవారి ఆశీర్వచనాలు ప్రసాదం అందజేశారు. కాగా.. అమ్మవారిని సినీ రచయిత తోటపల్లి మధు దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

# పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిర్వాకం

**ఎనిమిది కంటే తక్కువ తేమ ఉంటే గతంలో అదనంగా డబ్బులు**

- ఈసారి ఏగవేత.. నష్టపోతున్న రైతులు..
- బోనస్ చెల్లించాలని రైతుల డిమాండ్


పత్తిలో తేమ శాతం పరిశీలిస్తున్న సీసీఐ సిబ్బంది



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో వచ్చిన పత్తి వాహనాలు

ఆదిలాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఐదు రోజుల క్రితం పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాగా.. సీసీఐతోపాటు ప్రైవేటు వ్యాపారులు పంటను సేకరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ యేడాది క్వింటాలుకు రూ.7521 ధర ప్రకటించగా.. సీసీఐ ఆధ్వర్యంలో 8 నుంచి 12 శాతం వరకు తేమ ఉన్న మద్దతు ధరతో సేకరిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.7120తో ఎనిమిది శాతం తేమతో పంటను కొనుగోలు చేస్తున్నారు. తేమ విషయంలో కొంత సడలింపు ఇవ్వాలని రైతులు అధికారులను కోరినా కనికరించలేదు. పంటను ఎండలో నాలుగైదు రోజులు ఆరబెట్టుకుని తేమ లేకుండా తీసుకొస్తున్నారు.

### గతంలో చెల్లింపులు.. ఇప్పుడు ఎగవేత..

సీసీఐ ఆధ్వర్యంలో పత్తిని 8 నుంచి 12 శాతం తేమతో కొనుగోలు చేస్తుండగా.. 8 శాతం తేమ ఉంటే క్వింటాలుకు రూ.7521, 9 శాతం ఉంటే రూ.7445.7, 10 శాతం ఉంటే రూ.7370, 11 శాతం ఉంటే రూ.7295, 12 శాతం తేమ ఉంటే రూ.7220 చెల్లిస్తారు. రైతు వాహనంలో తీసుకొచ్చిన పత్తిని ఐదు చోట్ల తేమను పరిశీలించి సగటును లెక్కిస్తారు. గతంలో సీసీఐ ఆధ్వర్యంలో సేకరించిన పత్తికి 8 శాతం తేమ కంటే తక్కువ ఉంటే క్వింటాలుకు నిర్ధేశించిన ధరలో ఒక శాతం అదనంగా చెల్లించేవారు. 2 శాతం తక్కువ ఉంటే 2 శాతం అదనంగా ధర ఇచ్చేవారు. ఇలా రైతులకు ప్రయోజనం చేకూరింది. ఈసారి సీసీఐ కొనుగోలు చేస్తున్న పంటకు ధర చెల్లించకపోవడంతో రైతులు భారీగా నష్టపోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి తేమ తక్కువ ఉన్న పంటకు అదనంగా ధర చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

### రూ.3,300 నష్టపోయా..

తలమడుగు మండలంలోని కజ్జర్లకు చెందిన రైతు సతీశ్ తన ట్రాక్టర్‌లో 22 క్వింటాళ్ల పత్తిని విక్రయించడానికి మంగళవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చాడు. మార్కెటింగ్ అధికారుల సూచనల మేరకు పంటలో తేమ లేకుండా ఉండేలా నాలుగు రోజులు పంటను ఎండలో ఆరబెట్టాడు. మార్కెట్ యార్డులో సీసీఐ సిబ్బంది తేమ శాతం పరిశీలించగా ఆరు శాతం వచ్చింది. గతంలో మాదిరి సీసీఐ రైతులకు 8 శాతం తక్కువ తేమ ఉంటే ఒక్కో పాయింట్‌కు రూ.75 చొప్పున రెండు పాయింట్లకు రూ.150 అదనంగా కలుపుకుని క్వింటాలుకు రూ.7671 వస్తాయని ఆశించాడు. తేమను కొలిచిన అధికారులు 6 శాతానికి బదులు 8 శాతం ఉందని రాశారు. తేమ శాతం తక్కువ వచ్చిందని అదనంగా డబ్బులతో కలిపి ధర రాయాలని సీసీఐ అధికారులను కోరగా వారు నిర్లక్ష్యంగా బ్యాంకువాళ్లు చెల్లిస్తారు, అక్కడికి పొమ్మని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని రైతు సతీశ్ అన్నారు. దీంతో చేసేదేమీ లేక ఎనిమిది శాతం తేమతో క్వింటాలుకు రూ.7521 చొప్పున సీసీఐకి అమ్ముకోవాల్సి వచ్చింది. సీసీఐ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా రైతు సతీష్ రూ.3,300 నష్టపోవాల్సి వచ్చింది. ఇలా సతీశ్ వంటి రైతులు ఎంతో మంది ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పంటను ఆరబెట్టి తీసుకొచ్చినా సీసీఐ అదనంగా ధరను చెల్లించపోవడంతో నష్టపోతున్నారు.


ఆరు శాతం తేమ వచ్చినా ఎనిమిది శాతం రాశారని రశీదు చూపిస్తున్న రైతు సతీశ్


ధర్నా చేస్తున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సమాఖ్య సభ్యులు

## సబ్సిడీ నిధులను విడుదల చేయాలి

**తెలంగాణ ఆదివాసీ గిరిజన సమాఖ్య జిల్లా కన్వీనర్ మెస్రం భాస్కర్**

ఎదులాపురం, అక్టోబర్ 29 : రాష్ట్రవ్యాప్తంగా రూ.265 కోట్లు పెండింగ్ ట్రైకార్ సబ్సిడీ నిధులను విడుదల చేసి, కొత్త యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సమాఖ్య జిల్లా కన్వీనర్ మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 32,122 మంది లబ్ధిదారులు ఉన్నారని, వారికి రూ.265 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విడుదల చేయని యెడలరాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సమాఖ్య నాయకులు హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏవో బడల రాంరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ పోచ్చిరం, సభ్యులు చాహకటి కిరణ్, మాడవి అనిల్, సాయి, మహేశ్, సునీల్, సందీప్ పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ డీఎంహెచ్‌వోగా నరేందర్


డాక్టర్ రాథోడ్ నరేందర్

ఎదులాపురం, అక్టోబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం 13 మంది వైద్యాధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఆదిలాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ రాథోడ్ నరేందర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా బదిలీ చేసింది. గతంలో ఆదిలాబాద్ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పని చేసిన నరేందర్ రాథోడ్ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లాలో రెగ్యులర్ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.కృష్ణ పని చేస్తున్న ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన రెండున్నర నెలలపాటు జిల్లాలో పని చేశారు. ఆగస్టు 15న బాధ్యతలు స్వీకరించి 15 రోజుల పాటు సెలవులో ఉన్నారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో వివిధ కార్యక్రమాల్లో వెనుకంజలో జిల్లా నిలిచింది. గతంలో పని చేసిన నరేందర్ రాథోడ్ సమయంలో రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా అన్ని కార్యక్రమాల్లో ముందంజలో ఉంది. మళ్లీ డాక్టర్ నరేందర్ రాథోడ్‌ను ఆదిలాబాద్ డీఎంహెచ్‌వోగా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.


నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీని ప్రారంబిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్


## పీహెచ్‌సీ, పాఠశాల ప్రారంభం

పెంబి, అక్టోబర్ 29 : మండల కేంద్రంలో రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ.1.20 కోట్లతో నిర్మించిన నూతన పాఠశాల భవనాలను కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఎంపీ గొడం నగేశ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా పుల్గంపాండ్రి-సిరిచెల్మ రోడ్డు, పస్పుల-అంకెనా రోడ్డు, పస్పుల వద్ద కడెం వాగుపై వంతెనలు నిర్మించాలని ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు వినతి పత్రాలు అందజేశారు. పెంబి భీమన్న చెరువులో నీటి మట్టం తగ్గిపోయిందని, పంటలు ఎండిపోయే ప్రమాదముందని, డీ-28 కాలువకు మరమ్మతులు చేపట్టి భీమన్న చెరువుకు సాగు నీరు అందించాలని రైతులు ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజేందర్, డీఈవో రవీందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, ఎంఈవో రాంచందర్, మాజీ సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, నాయకులు స్వప్నిల్, వెంకటేశ్, గోవింద్ పాల్గొన్నారు.

# క్వింటాలు పత్తికి రూ.8,800 చెల్లించాలి

- గుజరాత్ తరహాలోనే ధర ఇవ్వాలి..
- మాజీ మంత్రి జోగు రామన్న
- సీసీఐ అధికారికి వినతిపత్రం అందజేత

ఆదిలాబాద్, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలోని పత్తి రైతులకు గుజరాత్ రైతులకు చెల్లిస్తున్న విధంగా క్వింటాలుకు రూ.8,800 ధర చెల్లించాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్ సీసీఐ కార్యాలయంలో అధికారి మిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. పంట కొనుగోళ్లలో దళారులు తక్కువ ధరకు కొనుగోళ్లు జరుపకుండా కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ కొనుగోళ్లను ప్రారంభించాలన్నారు. దేశంలో బడాబాబులు వేల కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును ఎగ్గొట్టి ఇతర దేశాలకు పారిపోతున్నారని, కేంద్ర ప్రభుత్వం వాణిజ్య కొనుగోళ్ల వల్ల జరిగే నష్టం ఏమీ లేదన్నారు. పత్తిని తక్కువ ధరకు అమ్ముకుంటూ రైతులు నష్టపోతుంటే ఆదుకోవాల్సిన స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ పార్టీ సమావేశాలంటూ తిరుగుతున్నాడని మండిపడ్డారు. రైతులకు నష్టం జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, సెవ్వా జగదీశ్, నర్సింగారావు, కొప్ర రాజు, గంగయ్య, పరమేశ్వర్, పురుషోత్తం, సలీం, సతీశ్, శివకుమార్ ఉన్నారు.


సీసీఐ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## నాణ్యమైన వస్తువులనే విక్రయించాలి

- డీ మార్ట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు
- కాలం చెల్లిన వస్తువులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కాలం చెల్లిన వస్తువులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 29 : వ్యాపారులు వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించాలని ఫుడ్‌సేఫ్టీ అధికారిణి ప్రత్యూష అన్నారు. సోమవారం రాత్రి నిర్మల్ పట్టణంలోని డీ మార్ట్‌లో కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. పండుగ సీజన్‌లో వ్యాపారులు పలు వస్తువులను కొనుగోలు చేసేందుకు దుకాణాలకు రావడంతో కాలం చెల్లిన నెయ్యి ప్యాకెట్‌లు లభ్యమయ్యాయని, ఆ వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటితోపాటు మరికొన్ని వస్తువులను స్వాధీనం చేసుకుని ల్యాబ్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వస్తువులను కొనుగోలు చేసే వినియోగదారులు ప్రతి వస్తువును పూర్తిగా గమనించాలని.. వస్తువు తయారైన తేదీ, గడువు తేదీని పూర్తిగా నిర్ధారించుకోవాలని తెలిపారు. ఎక్కడైన కల్తీ విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

## పులి పాదముద్రల గుర్తింపు

సారంగాపూర్, అక్టోబర్ 29 : మండలంలో పెద్దపులి ఐదు రోజులుగా సంచరిస్తు ప్రజలు, ఫారెస్టు అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న విషయం తెలిసిందే. అయితే మంగళవారం డిప్యూటీ రేంజ్ అధికారి నజీర్‌ఖాన్ ఆధ్వర్యంలో పెద్దపులి జాడ కనుక్కునేందుకు నాలుగు బృందాలుగా ఏర్పడి మానిటరింగ్ చేశారు. పాదముద్రలను బోథ్, ఇప్పచెలిమి సరిహద్దు అటవీ ప్రాంతంలో గుర్తించారు. అనంతరం లక్ష్మీనగర్, ఆదివాసీగూడల్లో గిరిజనులకు పెద్దపులి సంచారం గురించి అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతాల వద్ద ఉన్న గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని, పెద్దపులి కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఇందులో డీఆర్‌వోలు ఇర్ఫాన్, టాస్క్‌ఫోర్స్ డీఆర్‌వో రాజశేఖర్, ఎఫ్‌ఎస్‌వో అర్షద్, ఎఫ్‌బీవోలు స్వప్న, సుజాత, స్రవంతి, అలీం, రాజసింధులు పాల్గొన్నారు.


వివిధ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్, ఆర్సీవో

## విద్యార్థుల భవిష్యత్ మన చేతుల్లోనే ఉంది

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాపోటీలు

ఎదులాపురం, అక్టోబర్ 29 : విద్యార్థుల భవిష్యత్ మన చేతుల్లోనే ఉందని, మనం జాగ్రత్తగా చూసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా ఉపాధ్యాయులు, పీఈటీలకు సూచించారు. జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్ బోర్డులో గల బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 14, 19 క్రీడోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సరస్వతీతో పాటు మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. అలాగే 13 పాఠశాలు, 11 కళాశాలల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ ద్వారా గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గెలుపు, ఓటములు సహజమేనన్నారు. నవంబర్ చివరి వారంలో రాష్ట్రస్థాయిలో అన్ని సొసైటీలకు పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే ఇంటర్ సొసైటీలో నిర్వహించే పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబర్చి మెడల్స్ సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెమొంటో అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో గోపీచంద్ రాథోడ్, ప్రిన్సిపాల్స్ రంగన్న, కీర్తి రావ్, ఉమాదేవి, సంగీత, విద్యార్థులు ఉన్నారు.

### రూ.23 లక్షలు మంజూరు

బీసీ గురుకులంలోని గ్రౌండ్ లెవలింగ్, ఫెన్సింగ్, చిన్నచిన్న మరమ్మతుల కోసం రూ.23 లక్షలు మంజూరు చేశామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా ఆర్సీవోల సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో గోపీచంద్ రాథోడ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరడంతో నిధులు మంజురు అయ్యాయని కలెక్టర్ గుర్తు చేశారు. నిర్మాణంలో ఉన్న జైనథ్ గురుకుల పాఠశాల భవనానికి మరిన్ని నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామని పేర్కొన్నారు.

## ఓటరు జాబితా ముసాయిదా విడుదల

ఆదిలాబాద్, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ) : ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఎస్ఎస్ఆర్ 2025 ముసాయిదా జాబితాను జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా మంగళవారం విడుదల చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,46,243 ఓటర్లు ఉండగా.. పురుషులు 1,20,382, మహిళలు 1,25,855, ఇతరులు 6.. బోథ్ నియోజకవర్గంలో మొత్తం 2,12,095 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,02,794, మహిళలు 1,09,299, ఇతరులు ఇద్దరు ఉన్నారని పేర్కొన్నారు. ముసాయిదా జాబితా జిల్లా ఎన్నికల కార్యాలయంతోపాటు ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి నవంబర్ 28, 2024 వరకు జాబితాపై అభ్యంతరాల స్వీకరణతోపాటు కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 24, 2024 వరకు అభ్యంతరాలు, ఓటరు క్లెయిమ్స్ పరిష్కరించి జనవరి 6, 2025 రోజు తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

## ఫీజు-రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ధర్నా

ఎదులాపురం, అక్టోబర్ 29 : కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం సీఎం రేవంత్‌రెడ్డికి విద్యారంగం మీద ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ఉన్న రూ.7,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అక్షయ్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో సర్టిఫికెట్ రావడం లేదని, దీంతో ఉన్నత చదువులకు దూరం కావాల్సి వస్తుందని మండిపడ్డారు. కొన్ని రోజులుగా ప్రైవేటు యాజమాన్యాలు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సోయి లేకుండా పోయిందని, విద్యార్థులకు న్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిధులు విడుదల చేయకపోతే సెక్రటేరియెట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులతో ఏబీవీపీ నాయకులు